ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 9 ఏప్రిల్ 2025



3 గంటలపాటు నిలిచిన ఫలక్‌నుమా..

సున్నాదేవి రైలుట్రాక్‌పై ఫలక్‌నుమా రైలు 2 గంటలు, మందస రైల్వేస్టేషన్‌లో గంటపాటు నిలిచిపోయింది. బఫర్ విరిగిన తరువాత రైలు ఇంజనుతో పాటు వేరయిన బోగీలను మందసలో నిలిపేశారు. అనంతరం అదే రైలు ఇంజను సహాయంతో పట్టాలపై నిలిచిన బోగీలను మందస వరకూ తీసుకువెళ్లారు. అక్రడ ప్రమాదానికి కారణమైన ఏ-1 ఏసీ కోచ్ బోగిని వేరు చేశారు. అందులో ఉన్న 42 మంది ప్రయాణికులకు వేరువేరు బోగీల్లో సీట్లు సర్దుబాటు చేసి మందస నుంచి భువనేశ్వర్ వరకు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారందరికీ భువనేశ్వర్‌లో ఏసీ-2 టైర్ కోచ్‌ను ఏర్పాటు చేశామని రైల్వే ప్రజాసంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

కాగా.. రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రమాదం జరిగిన తరువాత బరంపురం, ఇచ్ఛాపురం వెళ్తున్న ప్రయాణికులు కొంతమంది రైలుదిగి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

ఫలక్‌నుమాకు తప్పిన ముప్పు

పలాస రైల్వేస్టేషన్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో సుమ్మాదేవి రైల్వేగేటు వద్ద మంగళవారం సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా (12704) రైలుకు పెను ప్రమాదం తప్పింది. రైలుబోగీలను కలిపే బఫర్ విరిగిపోవడంతో 15 బోగీలు పట్టాలపై నిలిచిపోయాయి. రైలు ఇంజన్‌తో లింక్ ఉన్న 8 బోగీలు వెళ్లిపోయాయి. బఫర్ విరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో వెనుకన ఉన్న గార్డ్ పరిశీలించి.. డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే రైలు నిలుపుదల చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘట స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ ఘటన నేపథ్యంలో సుమారు మూడు గంటలపాటు రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

సుమ్మాదేవి లెవెల్‌క్రాస్ గేట్ వద్ద రైలు నిలిచిపోవడంతో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- బఫర్ విరిగి పట్టాలపై నిలిచిన 15 బోగీలు
- ఇంజనుతో పాటు 8 బోగీలు వెళ్లిపోయిన వైనం
- అప్రమత్తమైన గార్డు, డ్రైవర్
- ఉన్నతాధికారుల చొరవతో మరమ్మతులు





రైలు బోగీలను కలిపే బఫర్ విరిగి పడిపోయిందిలా..

పలాస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)

పలాస రైల్వేస్టేషన్ నుంచి మంగళవారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704) రైలు బయలుదేరిన 20నిమిషాల వ్యవధిలో (7.15 గంటల సమయంలో) సుమ్మాదేవి లెవెల్‌క్రాస్ గేట్ వద్ద బోగీలను కలిపే ఐరన్ బఫర్ విరిగిపోయింది. మొత్తం 23 బోగీల్లో సుమారు 2వేల మందికిపైగా ప్రయాణిస్తున్నారు. కాగా.. ఏ-1 ఏసీ కోచ్ బోగీ వద్ద బఫర్ విరిగిపోవడంతో రైలుపట్టాలపై 15 బోగీలు ఉండిపోయాయి. ఇంజన్‌తో పాటు 8 బోగీలు ముందుకు వెళ్లి పోయాయి. ఎవరో రైలు చైన్ లాగి ఉంటారని భావించి.. బోగీ చివరన ఉన్న గార్డు మధు కుమార్ (విశాఖపట్నం) రైలు దిగి పరిశీలించారు. రైలుకు ఉన్న ఇంజనుతో పాటు బోగీలు ముందుకు వెళ్లిపోతున్నట్లు గుర్తించారు. అనంతరం లోకో పైలెట్ (డ్రైవర్) ఆర్.ఖాన్‌కు సమాచారం ఇచ్చారు. సకాలంలో స్పందించి రైలును నిలిపేశారు. ఖుర్దారోడ్ వైపు వెళ్తున్న పట్టాలు ఎత్తులో ఉండడం.. రైలు 75 కిలోమీటర్ల వేగంతో వెళ్లడంతో దాన్ని ఆపడం సాధ్యమైంది. సాధారణంగా ఫలక్‌నుమా రైలు 110 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. అదేస్పీడుతో రైలు వెళ్లిఉంటే ప్రమాదం చోటుచేసుకుని ఆస్తి (మిగతా 6వ పేజీలో..)

కిడ్నీ వ్యాధుల్లో సిక్కోలు అగ్రస్థానం

- రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలోనే అత్యధిక కేసులు
- తర్వాత స్థానంలో క్షయ, డయేరియా రోగాలు
- 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'లో భాగంగా వైద్య పరీక్షలు
- ప్రభుత్వ నివేదిక వెల్లడి



పలాసలో డయాలసిస్ సేవలు పొందుతున్న కిడ్నీ బాధితులు (ఫైల్)

శ్రీకాకుళం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా జిల్లాలో కిడ్నీ వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా కిడ్నీ బాధితులు సిక్కోలులోనే ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో మరోసారి స్పష్టమైంది. వ్యాధికి గల కారణాలు, పరిస్థితులపై అధ్యయనం చేసి తద్వారా రోగాలు నియంత్రించాలనే ఉద్దేశంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిలాను యూనిట్‌గా తీసుకుంది. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సాధనలో భాగంగా అన్ని వయసుల వారిలో కొంతమందికి వైద్య పరీక్షలు చేపట్టింది. ఇందులో కిడ్నీ రోగాలతోపాటు క్షయ, డయేరియా వంటి వ్యాధుల్లో జిల్లా ముందంజలో ఉందని నిర్ధారణ అయింది. ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకుంటే చాలావరకు రోగాలను ముందస్తుగా నియంత్రించే అవకాశముందని ప్రభుత్వం నివేదిక వెల్లడించింది.

జిల్లాలో పరీక్షలు.. రోగుల సంఖ్య

- రాష్ట్రంలో 1,73,479 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారని ప్రస్తుతం నిర్ధారణ అయ్యింది. ఇందులో పురుషులు 1,22,672 మంది, మహిళలు 50,807 మంది ఉన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 11,153 మంది కిడ్నీ రోగులు ఉన్నట్లు వెల్లడైంది. ఇందులో 40నుంచి 60ఏళ్లలోపు వారే అధికం. సిక్కోలు తర్వాత స్థానంలో పల్నాడు, గుంటూరు జిల్లాలు నిలిచాయి.
- టీబీ, డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధుల్లో కూడా శ్రీకాకుళం జిల్లా ముందంజలో నిలవడం విచారకరం. అలాగే అనీమియా, ప్రీ టర్మ్ బర్త్స్, మాల్ న్యూట్రిషియన్ సమస్యలతో బాధపడేవారు కూడా జిల్లాలోనే అత్యధికంగా ఉన్నారు. హైపర్‌టెన్షన్‌తో 88,664 మంది, షుగర్ - 38,401 మంది, నరాల సమస్య - 6,431మంది, శ్వాసకోస వ్యాధులు - 2,945 మంది, కాలేయం జబ్బులు - 1,719 మంది, క్యాన్సర్ - 5,711 మంది, గుండె జబ్బులతో 11,967 మంది బాధపడుతున్నట్లు వైద్యపరీక్షల ద్వారా నిర్ధారణ అయ్యింది. వ్యాధుల బారిన పడినవారిలో 35 ఏళ్ల నుంచి 65 ఏళ్ల లోపు వారే అధికంగా ఉన్నారు.

మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు

గుండె, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, మెదడు స్ట్రోక్‌లకు ప్రధాన కారణాలు హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఊబకాయమే. ఈ వ్యాధులను నియంత్రించడానికి ఉప్పు, చక్కె, నూనె వాడకాన్ని తగ్గించాలని ప్రభుత్వం నివేదికలో సూచించింది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లే వ్యాధుల వ్యాప్తికి కారణమని స్పష్టం చేసింది. కనీసం ముప్పై నిమిషాల శారీరక వ్యాయామం లేదా నడక, యోగా చేయడం వల్ల రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, ప్రాణాయామం వంటివి చేయాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్స్, పాలిష్ చేసిన బియ్యాన్ని తీసుకోరాదు. మిల్లెట్లు, బ్రౌన్ రైస్‌ను తీసుకోవాలి. మరింత మెరుగైన ఆరోగ్యం కోసం పండ్లు, తాజాకూరగాయలు, ప్రొటీన్, తగినంత ఫైబర్ ఉండే సమతుల్య ఆహారం తీసుకుంటే రోగాలు ప్రబలకుండా నియంత్రించుకునే అవకాశముంది. పురుగు మందుల అధిక వినియోగం కారణంగా 'పంజాబ్' రాష్ట్రం క్యాన్సర్‌కు రాజధానిగా మారింది. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే.. ఔషధంగా ఆహారాన్నే.. వంటగదినే ఫార్మశీగా ఉపయోగించాలని నివేదికలో సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత కూడా ముఖ్యమే. క్లోరినేటెడ్ నీటిని తాగితే.. కొంతమేర వ్యాధులు రాకుండా ఉంటాయని నివేదికలో పొందుపరిచారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు

జిల్లాలో ఉన్న 8 నియోజకవర్గాల్లో పీపీపీ పద్ధతిలో వంద నుంచి 300 పడకల మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అభివృద్ధి జరుగనుంది. ప్రభుత్వం జూన్ నెలాఖరున పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల్లో స్క్రీనింగ్ చేసిన తర్వాత.. నియోజకవర్గాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేయనుంది. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఆధునాతన, ఉన్నతస్థాయి ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను దగ్గర చేయడమే లక్ష్యంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అభివృద్ధి చేయనున్నారు.

ఢిల్లీకి చేరిన ఎస్‌బీఐ చిచ్చు

- గార బ్యాంకు కేసులో అవకతవకలపై జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- టీఆర్ఎం రాజును బర్తరఫ్ చేయాలి: స్వప్నప్రియ కుటుంబ సభ్యుల డిమాండ్

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో తాకట్టు పెట్టిన బంగారం ఆభరణాల మాయం కేసు వ్యవహారం ఢిల్లీకి చేరింది. 2023 నవంబరులో వెలుగులోకి వచ్చిన బంగారు ఆభరణాలు మాయం ఘటన ఎన్నో మలుపులు తిరగ్గా.. బ్యాంక్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి నిండు ప్రాణాన్ని బలిగొన్న విషయం పాఠకులకు తెలిసిందే. కాగా.. ఈ కేసులో అప్పట్లో అవకతవకలకు పాల్పడి.. పరోక్షంగా తమ కుమార్తె మృతికి కారణమైన టీఆర్ఎం రాజును శిక్షించాలంటూ స్వప్నప్రియ కుటుంబ సభ్యులు సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. అప్పట్లో బంగారం ఆభరణాలు మాయం కావడంలో బ్రాంచ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, క్యాష్ ఆఫీసర్, ఫీల్డ్ ఆఫీసర్, ప్రైవేట్ ఏజెంట్ పాత్రలపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ తర్వాత బ్యాంక్‌లో పనిచేస్తున్న డిప్యూటీ మేనేజర్ ఉరిటి స్వప్నప్రియపై నిందారోపణలకు కొందరు సిద్ధమవ్వగా.. ఆమె ఆవేదనతో ఆత్మహత్య చేసుకుంది. దీంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయగా నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసును తప్పుదోవ పట్టించేలా ప్రయత్నించిన అప్పటి శ్రీకాకుళం ఎస్‌బీఐ ఆర్ఎం టి.ఆర్.ఎం.రాజు పాత్రపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసుతో సంబంధం లేని స్వప్నప్రియ అన్న కిరణ్‌ను దోషిగా చేయడం, అందుకు తగ్గ ఆదారాలు లభించకపోవడంతో ఆర్ఎం టీఆర్ఎం రాజు పాత్రపై స్వప్నప్రియ కుటుంబ సభ్యులు అమరావతిలోని ఎస్‌బీఐ ఛీఫ్ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. శాఖాపరమైన విచారణ జరగడంతో ఆర్ఎమ్‌ను శ్రీకాకుళం నుంచి ముంబై ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే స్వప్నప్రియ కుటుంబ సభ్యులు గార ఎస్‌బీఐ కేసులో తమకు అన్యాయం జరిగిందని ఆర్ఎమ్ రాజును శిక్షించాలని సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని డీజీపీ కార్యాలయానికి సిఫారసు చేశారు. తాజాగా.. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్వప్నప్రియ కుటుంబ సభ్యులు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అప్పటి ఆర్ఎం టీఆర్ఎమ్ రాజును శిక్షించి, బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అన్యాయంగా స్వప్నప్రియ, కిరణ్‌ను ఈ కేసులో ఇరికించారని, ఎస్‌బీఐ చైర్మన్ కార్యాలయానికి తప్పుడు నివేదికలు అందించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసి ఆరు నెలలైనా ఆర్ఎం రాజుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తక్షణమే ఎస్‌బీఐ ఛైర్మన్ స్పందించి తమ కుటుంబానికి అన్యాయం చేసిన టీఆర్ఎం రాజుతోపాటు డీజీఎంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న స్వప్నప్రియ కుటుంబ సభ్యులు

చేపల వేటకు వెళ్లి.. వలకు చిక్కుకుని



- మెట్టక్కివలస మత్స్యకారుడి మృతి

8లో

గయా బాలు (ఫైల్)

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్, అచ్చెన్నాయుడు
- వంశధార షట్టర్ల విషయమై అచ్చెన్న ఆగ్రహం

6లో

కుండపోత వర్షం

- ఉరుములు, మెరుపులకు భయాందోళన చెందిన ప్రజలు

7లో



శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

పనులు చేయకపోతే.. కాంట్రాక్టర్లను మార్చేయండి

- వారిని బతిమలాడుకోవడం ఏంటి?
- గత ఐదేళ్లూ ఇలానే రాష్ట్రం సర్వనాశనం
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- ఐదేళ్లలో ఒక్క రోడ్డూ వేయలేదని చురకలు
- మధ్యాహ్నం వరకు సమావేశం సజావుగా..
- ప్రశ్నించి కెలుక్కున్న ఎమ్మెల్సీ విక్రాంత్
- మౌనం దాల్చిన ఎంపీపీలు, జడ్పీటీసీలు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జడ్పీ సర్వసభ్య సమావేశం వేదికగా.. తనను ప్రశ్నించిన వైసీపీ నేతకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సుతిమెత్తటి మాటలతో చెల్లుమనిపించారు. దీంతో ఇతర సభ్యులెవరూ మద్దతు పలకలేక మౌనం దాల్చారు. మంగళవారం జడ్పీ ఛైర్‌పర్సన్ విజయ అధ్యక్షతన.. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాజకీయ విమర్శలకు పోకుండా శాఖలవారీ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చేలా సమావేశం సాగింది. ముందుగా గ్రామీణ నీటిసరఫరా విభాగంతో సమావేశం ప్రారంభమై మధ్యాహ్నం వరకు సజావుగా జరిగింది. తర్వాత వైసీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అడిగిన ప్రశ్నతో.. చివరగా ఆ పార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు నోరెత్తలేని విధంగా మంత్రి సమాధానం ఇచ్చారు. దీంతో సమావేశం హాటుగా ముగిసింది.

కాంట్రాక్టర్లను బతిమలాడుకోవడమా?

సమావేశంలో మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'జలజీవన్ మిషన్ పనులను నిర్వహించేందుకు కాంట్రాక్టర్లను బతిమలాడుకోవడమేంటి? గత ఐదేళ్ల ఇలానే నాశనమైంది. ప్రభుత్వ పనులు నిర్వహించని కాంట్రాక్టర్‌ను అవసరమైతే మార్పు చేయండి. లేదంటే కేసులు (మిగతా 6వ పేజీలో..)

లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోండి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు మే 10న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. కక్షిదారుల సమస్యల పరిష్కారానికి ఇదో చక్కని అవకాశమన్నారు. వివిధ శాఖల అధికారులు లోక్‌అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు రాజీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



సిక్కోలు నగరంపై నీలిమబ్బుల పందిరి

నీలిమబ్బులలో చంద్రహాసం

శ్రీకాకుళం నగర వాసుల కోసం మంగళవారం సాయంత్రం నీలిమబ్బులు ఆహ్లాదాన్ని మోసుకొచ్చాయి. ఆ మబ్బుల మాటు నుంచి కాసేపు తొంగి చూస్తూ... దోబూచులాడిన చంద్రుడు... ఇక దోబూచులు నావల్ల కాదంటూ... ఏకంగా మేఘాలపైన కూర్చుని... సిరివెన్నెల కురిపించాడు. నగరవాసులను తన కిరణాల వెలుగుల్లో ఓలలాడించాడు.

-అరసవల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)



మబ్బుల్లో చంద్రుడు ఇలా..

ఉన్నతంగా ఎదిగేందుకు..

- అందుబాటులో పీజీ కోర్సులు
- పీజీ సెట్ నోటిఫికేషన్ విడుదల
- జూన్ 9 నుంచి 13 వరకు ప్రవేశ పరీక్షలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యాభ్యాసం.. ఒకప్పుడు అందరికీ సాధ్యమయ్యేది కాదు. కానీ నేడు సామాన్యులకూ అందుబాటులోకి వచ్చింది. గతంలో ఐదారు జిల్లాలకు కలిపి ఓ విశ్వవిద్యాలయం ఉండేది. ప్రస్తుతం దాదాపుగా ప్రతి జిల్లాలోనూ ఒకటి చొప్పున యూనివర్సిటీలు ఉనాయి. అప్పట్లో దూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించేందుకు క్యూ కట్టేవారు. కారణాలు ఏమైనా గానీ ప్రస్తుతం ఉన్నత విద్యపై అంతగా ఆసక్తి చూపడం లేదనే చెప్పాలి. పీజీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య నానాటికీ తగ్గిపోతుండడంతో వర్సిటీల్లో సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీకి అనుబంధంగా సుమారు మూడు దశాబ్దాల పాటు పని చేసిన పీజీ సెంటర్ (ఎచ్చెర్ల) 2008లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. అంబేడ్కర్ వర్సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో పీజీ అడ్మిషన్లకు సెట్ నోటిఫికేషన్ విడుదలైంది.

ఎంతో ప్రయోజనం..

అంబేడ్కర్ వర్సిటీకి అనుబంధంగా జిల్లాలో 80కు పైగా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో చదువుతూ ఏటా సుమారు 18 వేల మంది వరకు విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఇందులో చాలా మంది పీజీ వైపు చూడడం లేదు. డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగాన్వేషణకు ప్రాధాన్యం ఇస్తున్న యువత... పీజీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. పీజీలో చేరి... ఒక వైపు చదువుతూనే మరోవైపు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఉందని మేధావులు సూచిస్తున్నారు. పీజీ కోర్సుల్లో చేరడం వల్ల విద్యార్థుల్లో విశ్లేషణా త్మక దృష్టి వృద్ధి చెందుతుందని... సూక్ష్మ పరిశీలనకు కూడా అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఏదైనా అంశంపై పరిశోధ నాత్మకంగా ఆలోచించే వీలుందని అంటున్నారు. వర్సిటీలో ఉన్న గ్రంథాలయాలను వినియోగించుకుంటే బోలెడు ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు. అలాగే సమవయస్కులైన యువత ఒకే చోట ఉండడం వల్ల పోటీ పరీక్షలకు సులువుగా సిద్ధం కావచ్చని... వివిధ అంశాలపై చర్చావేదికలు నిర్వహిస్తూ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చుననడంలో సందేహం లేదు. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, కరెంట్ అఫైర్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌పై అవగాహన తదితర అంశాల్లో కూడా పట్టు సాధించే అవకాశం ఉంది. పీజీ కోర్సుల్లో చేరడం వల్ల ఉన్నతంగా స్థిరపడే వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు.

నోటిఫికేషన్ విడుదల..

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు కలిపి కామన్‌గా ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు ఇస్తారు. 2025-26 విద్యా సంవత్స రంలో ప్రవేశాలకు శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (తిరుపతి) ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ మైంది. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు మే 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో ఓసీ, బీసీ విద్యార్థులకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి. వర్సిటీల్లోని కోర్సులను మూడు కేటగిరీలుగా విభజించి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులు రూ.850, బీసీ విద్యార్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.650 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఈ పరీక్షలు జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయి.

అంబేడ్కర్ వర్సిటీలోని కోర్సులు..

అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్, రూరల్‌డెవలప్‌మెంట్, ఎంకాం, ఇంగ్లీష్, ఎంఎల్ఐఎస్సీ, సోషల్‌వర్క్, తెలుగు, ఎంజేఎంసీ, ఎంఈడీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలెటికల్ కెమిస్ట్రీ, మేథ్స్, అప్లయిడ్ మేథ్స్, భౌతిక శాస్త్రం కోర్సులు ఉన్నాయి. వర్సిటీలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు ఐసెట్ ద్వారా జరుగుతున్నాయి. ఎల్ఎల్‌బీ కోర్సుల్లో అడ్మిషన్లు లాసెట్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్లను ఏపీ ఈఏపీ సెట్ ద్వారా కేటాయిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఆసక్తి, అర్హత గల విద్యార్థులు సెట్‌కు నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పీజీ కోర్సుల్లో చేరడం వల్ల విద్యార్థులు మరింత ఉన్నతంగా స్థిరపడేందుకు వీలుంటుంది.

-ప్రొఫెసర్ కేఆర్ రజని, వీసీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

'ఫలక్‌నుమా'కు తప్పిన ముప్పు

(ఐదో పేజీ తరువాయి)

ప్రాణనష్టం భారీగా జరిగేది. పైలెట్, గార్డ్ సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. పలాస రైల్వే డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవతిరావు, లైన్‌ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మాల్యాద్రి, మందస స్టేషన్ సూపరింటెండెంట్ గంటా హరిగోపాల్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి ఉన్నతాధికారులకు వివరించారు. రైలుకు మరమ్మతులు చేసిన తరువాత సాధారణ స్థితికి చేరుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

భారీ శబ్దంతో అప్రమత్తం..

పలాస రైల్వేస్టేషన్ దాటి పది నిమిషాల నుంచి బోగీల ద్వారా భారీ శబ్దాలు రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. రైలు బోగీలను కలిపే బఫర్ తెగిపోగా రెండింటిని కలిపే వ్యాక్యూమ్ ఎఫ్‌బీ (ఫీడ్‌పైప్), బీపీ (బ్రేక్ పైపు)ల సహాయంతో ఐదు కిలోమీటర్ల వరకూ రైలు ముందుకెళ్లింది. అనంతరం బఫర్ పూర్తిగా విరిగి కింద పడిపోవడంతో మొత్తం వ్యవస్థ అంతా ధ్వంసమైంది. వెనుక ఉన్న 15 బోగీలు ఆగిపోయాయి. వ్యాక్యూమ్ వ్యవస్థ లేకపోతే ప్రమాదం ఊహించడం కష్టమేనని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అనేక రైళ్లు ఆలస్యం..

ఫలక్‌నుమా రైలు బఫర్ విరిగిన నేపథ్యంలో పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, బరంపురం, ఆమదాలవలస రైల్వేస్టేషన్‌ల్లో అనేక రైళ్లను నిలిపేశారు. 12242 దురంతో సూపర్‌ఫాస్ట్ రైలును పలాసలో నిలుపుదల చేసి పది గంటల తరువాత దాన్ని విడిచిపెట్టారు. భువనేశ్వర్ పాసింజర్ రైలును పలాసలో నిలుపుదల చేసి మూడు గంటల తరువాత దాన్ని పంపించారు. గూడ్స్ రైళ్లన్నీ వివిధ ప్రాంతాల్లోకి తరలించారు. 10.30 గంటల తరువాత సాధారణ స్థితికి చేరుకున్న తరువాత మొత్తం రైళ్లన్నీ యథాతథంగా నడిచాయి.

ఆదిత్యుని వార్షిక కల్యాణం

అరసవల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఆలయ అనివెట్టి మండపంలో వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి సప్త అశ్వ రథవాహనంపై ఆలయ మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు ఆలయ అనివెట్టి మండపంలో కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఈవో భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి ఫణీంద్రశర్మ, రంజిత్‌శర్మ, నేతింటి హరిబాబు, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పనులు చేయకపోతే.. కాంట్రాక్టర్లను మార్చేయండి

(ఐదో పేజీ తరువాయి)

పెట్టండి. పాతపనులను రద్దుచేయాలి. జలజీవన్ మిషన్ పనులు.. ఒక వరం. జూన్‌కు ముగియాల్సిన పనులను మరో మూడేళ్లు పెంచేలా ప్రధానమంత్రిని ఒప్పించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఈ సభ ద్వారా అభినందన తెలియజేస్తున్నాం. నదులు, చెరువుల్లో నీరు లేదు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పనులు చేయాలి. తాగునీటి ఇబ్బందులు ఎదురైతే అధికారులే బాధ్యత వహించాలి. ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు పనులు కల్పించాలి. ప్రజాప్రతినిధులు అభివృద్ధికి సహకరించాలి. అక్రమాలకు పాల్పడే ఒకరిద్దరిపై చర్యలుంటేనే వ్యవస్థ గాడిలో పడుతుంది. ప్రజల్లో కూడా అవగాహన పెరిగింది. డీఎంహెచ్‌ఓ ఆఫీసులో అవినీతి వల్ల చెడ్డపేరు వస్తోంది. చాన్నాళ్ల నుంచి పాతుకుపోయినవారిని ఏరివేయాలి. త్వరలో డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే సమీక్ష నిర్వహించి తక్షణం చర్యలు తీసుకుందాం. జిల్లాలో టీబీ, డయేరియా ఎక్కువగా ఉంది. దీనిపై నివారణ చర్యలుండాలి. గత ప్రభుత్వ హయాంలో పేదల భూములను 22ఏ లో చేర్చేశారు. ఇప్పుడు 90 శాతం సమస్యలు రెవెన్యూవే ఉన్నాయి. పేదలు భూములు అమ్ముకుందామంటూ వీలుపడని పరిస్థితి. ఇవన్నీ సరిచేస్తున్నా'మని తెలిపారు.

ప్రశ్నించి.. జవాబుతో మాట్లాడలేక..

వైసీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్.. సమావేశంలో చివరలో మాట్లాడారు. ఇటీవల పాలకొండలోని ఓ సమావేశం నుంచి ఓ ఎంపీడీవో పోలీసులతో తనను బయటకు పంపారని, ఎమ్మెల్సీగా తాను సమావేశాలకు హాజరయ్యే హక్కు తనకు ఉందని.. సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉందని తెలిపారు. ఎంపీడీవో తీరుపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' ఎప్పుడు అమలు చేస్తారో మంత్రి చెప్పాలని.. అలానే సమాచారం ఎమ్మెల్సీలకు కూడా చెప్పేలా ఆదేశించాలని పేర్కొన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. రాజకీయపరంగా వైసీపీ తప్పిదాన్ని తూర్పారబట్టారు. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో నేను టెక్కలి ఎమ్మెల్యేగా ఉన్నా. మా రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం ఎంపీగా ఉన్నారు. మాకు ఏ ఒక్క కార్యక్రమం కూడా అప్పట్లో చెప్పలేదు. పైగా నా నియోజకవర్గంలో అప్పుడు ముఖ్యమంత్రి మూలపేట పోర్టు పనులను ప్రారంభించేందుకు వచ్చినా నాకు సమాచారం లేదు. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేపట్టినా ఎమ్మెల్యే ఉండాల్సిందే. కానీ ఆ నిబంధన అమలుకాకపోయినా నేను పట్టించుకోలేదు. భావనపాడు పోర్టును మేము ప్రకటిస్తే.. దాన్ని తీసేసి మూలపేట పోర్టు అని పెట్టి పనులు చేపట్టారు. ఇప్పుడు నేను అడ్డుకోవాలంటే అడ్డుకోగలను. మీరందరూ గతంలో నిర్మించిన భవనాలకు సంబంధించిన పనులు చేపట్టారు. వాటి బిల్లులను కూడా ఇప్పుడు నేను ఆపడంలేదు. వ్యవస్థలు శాశ్వతం.. ప్రభుత్వం శాశ్వతం. ప్రజలు శాశ్వతం. కానీ రాజకీయాలు కాదు. వంశధార నీటిని పలాస వరకు తెచ్చుకోలేకపోయారు. కనీసం ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు పూర్తిచేయలేకపోయారు. నేను మంత్రి అయ్యాక పూర్తిచేయించా. మీరు అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించినట్లు మేము చేస్తే ఎలా?... అలా చేయం. కచ్చితంగా ప్రొటోకాల్ అందరూ పాటించాల్సిందే. పలాస నియోజకవర్గంలో ఎయిర్ పోర్టు పెడుతున్నామంటూ అప్పుడే ఆందోళన ప్రారంభించేశారు. ఏ ప్రాజెక్టు తెస్తే ఆ ప్రాజెక్టును తరిమేద్దామంటే ఎట్లా. 74 శాతం వంశధార ప్రాజెక్టు పనులు పూర్తిచేయగా.. మిగిలిన పనులను గత ఐదేళ్లలో పూర్తిచేయలేకపోయారు. నదుల అనుసంధానాన్ని పట్టాలెక్కించలేకపోయారు. ఆఫ్‌షోర్‌ను పట్టించుకోలేదు. గ్రామాలకు రోడ్లు వేయలేకపోయారు. గత ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి చెప్పగలరా?' అని మంత్రి అచ్చెన్న ఎదురు ప్రశ్నించారు. 'ఇక సూపర్ సిక్స్ విషయానికొస్తే.. ప్రభుత్వం కచ్చితంగా కట్టుబడి ఉంది. ప్రభుత్వం వద్ద డబ్బు లేకున్నా.. ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కోటి అమలు చేస్తున్నాం' అని అన్నారు.

● క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకోండి

మెళియాపుట్టి మండలం నడసంద్రంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరగడం ఆందోళన కరమైన విషయం. క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకోవాలి. కొత్తూరు ఆసుపత్రిలో పరుపులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కడప నుంచి వచ్చిన ఓ వైద్యాధికారిణి ఇక్కడ విధులు నిర్వహించడం లేదని ప్రజలనుంచి ఫిర్యాదులు అందితే.. నేనే స్వయంగా కలెక్టర్‌కు చెప్పా. ఆమెను అక్కడ నుంచి తప్పించి.. మళ్లీ ఇప్పుడు మా నియోజకవర్గంలోనే నియమించారు. పనిచేయకుండా అందరితో గొడవపడే ఆ వైద్యాధికారిణిని దయచేసి మా నియోజకవర్గంలోనే ఉంచొద్దు.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

● గతంలో చేపట్టిన పనులపై విచారణ చేయాలి

అధికారులపై రుజువుల్లేని ఆరోపణలు సరికాదు. అంబటివానిపేటలో మిలటరీ డ్రస్సు వేసుకుని ఓ వ్యక్తి వెళ్తే ఆయనకు అక్కడ విద్యుత్ మీటరును ఇచ్చేశారు. ఇటువంటి కొత్త దందాలు జరిగాయి అప్పట్లో. అసలు నిబంధనలు ప్రకారం గ్రేడ్-2 ఇసుక లభ్యమవుతుందా..? ప్రస్తుత ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల తోపాటు.. గత ఐదేళ్లలో చేపట్టిన పనులపై నమూనాలను సేకరించి విచారణ చేయాలి. నిర్మించి వదిలేసిన నర్సింగ్ కళాశాలను వినియోగంలోకి తేవాలి. పంచాయతీ రాజ్‌కు రెగ్యులర్ ఈఈ లేరు. ఆఫీసును ఎత్తేశారు. మళ్లీ ఆఫీసును ఇక్కడ ప్రారంభించాలి.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

● నిధుల గోల్‌మాల్‌పై కేసు ఏదీ?

నరసన్నపేట నియోజకవర్గంలో చోడవరంలో సీఎఫ్, సీసీలు ఏకమై అవినీతికి పాల్పడ్డారు. రూ.80లక్షలు నిధులు గోల్‌మాల్ అయ్యాయి. దీనిపై ఏడు నెలల కిందట విచారణ జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. కనీసం పోలీసు కేసుపెట్టలేదు. దీనివల్ల మహిళా సంఘాలు డీఫాల్టర్‌గా చూపిస్తే ఎట్లా. దీనిపై డీఆర్డీఏ పీడీ ఎందుకు చర్యలు తీసుకోలేదు. పోలాకి మండలం జలజీవన్ మిషన్ పనుల్లో అసంతృప్తిగా ఉంది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సరిదిద్దాలి.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

ఇంకొందరు సభ్యులు ఏమన్నారంటే..

- జి.సిగడాం జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ మాట్లాడుతూ.. 'జడ్పీటీసీలకు తొలి ఆరునెలలు మాత్రమే గౌరవవేతనం ఇచ్చారు. ఆ తర్వాత ఇవ్వలేదు. ప్రభుత్వం మారింది. అందరికీ దండం పెడుతున్నా. జడ్పీటీసీలకు గౌరవవేతనం చెల్లించండి' అని కోరారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. ప్రజాప్రతినిధులు కోరుతున్న సమాచారాన్ని నివేదికల రూపంలో అందజేస్తామన్నారు. అలాగే కవిటిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.
- హిరమండలం జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు మాట్లాడుతూ.. 'హిరమండలం నిరాదరణకు గురవుతోంది. ఏ ఒక్క గ్రామానికి అనుసంధానం రోడ్లు లేకపోవడం వల్ల.. పక్క నియోజకవర్గం నుంచి ప్రజలు రాకపోకలు చేస్తున్నారు. ఇప్పటికైనా లింకు రోడ్లు నిర్మించాలి. పెండింగ్‌లో ఉన్న రెండు ప్రధాన వంతెన పనులను పూర్తిచేయాలి. అలికాం-బత్తిలి రోడ్డు పనులను బాగుచేయాలి' అని కోరారు.

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్, అచ్చెన్నాయుడు
- వంశధార షట్టర్ల విషయమై అచ్చెన్న ఆగ్రహం



మాట్లాడుతున్న మంత్రులు శ్రీనివాస్, అచ్చెన్నాయుడు తదితరులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడితో కలసి పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్లతో మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాల పెంపునకు చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, పల్లె పుష్కరిణులు, ఫిష్ డ్రై ప్లాట్‌ఫాంలు, ఫామ్ పాండ్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో నిర్మించిన చెత్త నుంచి సంపద యూనిట్లను ఉపయోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

వేసవిలోపే రోడ్ల పనులు

జిల్లాలో గుంతలు లేని రోడ్ల పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయ్యాయని.. వేసవి ముగిసేలోపు మిగిలిన పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్న ఆదేశించారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణలో భాగంగా నగర పరిధిలో ఆస్తినష్టం జరిగే వారికి రూ.7 కోట్లు పరిహారం మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. రాగోలులో రూ. 2.92 కోట్లతో సైనిక్ భవన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రాకకు వీలుగా ముహూర్తం సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నరసన్నపేటలో వంశధార షట్టర్ల విషయమై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్లుగా ఏసీబీలో కేసు ఉందని.. నీరుగారుస్తూ ఉంటే ఎలా అని ప్రశ్నించారు. అవసరమైతే అధికారులు తనతో విజయవాడ రావాలని.. శాశ్వత సమస్యకు పరిష్కారం కనుగొందామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు స్థలం సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ..

జిల్లాలో పిల్లలకు నాణ్యమైన పోషణ, ప్రాథమిక విద్యను అందించేందుకు పోషణ పఖ్వాడా కార్యక్రమం దోహదపడుతుందని ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన హబ్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం అనంతరం పోషణ పఖ్వాడా పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.

మహిళలకు మరింత ఆదాయం..

జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు అధిక ఆదాయ అవకాశాలు కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం మాట్లాడుతూ 'స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఉపాధి యూనిట్లు ప్రారంభించేందుకు అనుకూల రంగాలను గుర్తించాలి. శ్రీనిధి, ఉన్నతి పథకాలు.. నాబార్డు ప్రాజెక్టులపై సమీక్ష చేశాం. వ్యవసాయ అనుబంధ రంగాలు, లాభదాయక పంటల సాగు, సేవా రంగాలు, ఉత్పత్తి రంగాల్లో యూనిట్ల ఏర్పాటుతో మహిళలకు అధిక ఆదాయ అవకాశాలు లభిస్తా'యని మంత్రి అన్నారు.

వంట గ్యాస్ ధరల బాదుడు

- జిల్లా ప్రజలపై నెలకు రూ.3.46 కోట్ల భారం
- వినియోగదారుల్లో ఆందోళన

మెళియాపుట్టి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గృహావసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. సిలిండర్‌పై రూ.50 పెంచింది. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం-2 కింద పేదలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. సాంకేతిక కారణాల వల్ల కొంతమంది లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం వల్ల పెంచిన ధరలు భరించవలసి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.829.50 ఉండగా... తాజా పెంపుతో ఇది రూ.879.50కి చేరింది. జిల్లాలో ప్రస్తుతం 6,92,825 ఇంటి కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంచటంతో జిల్లా ప్రజలపై నెలకు సుమారు రూ.3,46,41,250 అదనపు భారం పడునుంది. దీనితో పాటు వాణిజ్య అవసరాలకు వినియోగించే సిలిండర్ ధరలు రూ.40 వంతున పెరిగాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో రూ.6.92 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. తొలి విడతలో ఉచిత గ్యాస్ డబ్బులు 4,35,992 కుటుంబాలకు రూ.33.31 కోట్లు జమ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. వివిధ కారణాలతో మిగిలిన వారికి వర్తింపజేయలేదు. మొదటి విడత రాయితీ సిలిండర్లు పొందడానికి గడువు మార్చి నెలాఖరుతో ముగిసినట్టు అధికారులు చెబుతున్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే వినియోగించే వారికి పెంచిన ధరలతో నేరు గా ప్రభావం పడకపోయినా... మిగిలి న వారికి మాత్రం ఈ ధరలు భారంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

60 రోజుల్లో సమస్య పరిష్కారం

●సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆమదాలవలస, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల పరిష్కార న్యాయ స్థానం దృష్టికి వచ్చిన సమస్యను 60 రోజు ల్లో పరిష్కరిస్తామని కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండ లంలోని తొగరాం ప్రభుత్వజూనియర్ కళా శాల విద్యార్థులకు విద్యుత్ వినియోగదా రుల పరిష్కార న్యాయస్థానంపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలని సూచించారు.అనంతరం ఆమదాలవలసలో ఇండస్ట్రీయల్ ఏరియా లో ఉన్న తొగరాం సెక్షన్ కార్యాలయంలో వినియోగదారుల పరిష్కార న్యాయ స్థానం కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ ఏడాది 12 క్యాంప్ కోర్టులను ఏర్పాటుచేసి ప్రజల నుంచివినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న విని యోగదారులు సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చున న్నారు. ఇప్పటివరకూ 8669 దరఖాస్తులు రాగా 8482 దరఖాస్తులను పరి ష్కరించినట్లు తెలిపారు.ఇందులో వినియోగదారులకు సుమారు15లక్షల వరకు నష్టపరిహారాన్ని అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఫైనాన్స్ సభ్యుడు సుబ్బారావు, టెక్నికల్ సభ్యులు సులేఖరాణి, ఇండిపెండెంట్ సభ్యుడు మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌కుమార్, డీఈఈ బి.రవికుమార్, రూరల్ ఏఈ రవికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

వాహనాలకు పత్రాలు సమర్పించాలి: సీఐ

శ్రీకాకుళంక్రైం,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో వాహనాల తనిఖీల సమ యంలో పట్టుబడిన, రోడ్డుపై నిబంధనలకు వ్యతిరేకంగా పార్కింగ్ చేసిన ద్విచ క్రవాహనాలను ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఈమేరకు ఆ వాహనా లకు సంబందించిన యజమానులు సంబందిత పత్రాలు సమర్పించి, వాహనా లను విడిపించలేదని ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారానికి ఇటువంటి వాహనాలు స్టేషన్‌లో 45 వరకు ఉన్నా యని, వీటికి సంబందించిన యజమానులు 12వ తేదీ నాటికి స్టేషన్‌లో తమ ఆధార్‌తోపాటు వాహనాల పత్రాలను సమర్పించి విడిపించుకోవాలని కోరారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 12వ తేదీకి వాహనాలకు సంబం దించిన వారు రాకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనాల వివరాలకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఆమదాలవలస, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):తిరుపతిలో మే 15న జరిగే అఖిల భారత యువజనసమాఖ్య మహాసభలను విజయవంతంచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ధనుంజయ్, మోక్షిత్, తేజ, సిద్దార్థ, నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అభాండాలు వేయడం తగదు

ఆమదాలవలస, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై అభాం డరాలు వేయడం తగదని టీడీపీ నాయకుడు పేడాడ జనార్దనరావు తెలిపారు. మంగళవారం శ్రీహరిపురంలో విలేకరులతో మాట్లాడుతూ బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలోగల వెన్నెలవలస వద్ద జెన్‌కో థర్మల్‌పవర్ కేంద్ర నిర్మాణా నికి అడ్డుపడడం నియోజకవర్గ అభివృద్ధి, రైతుల, గిరిజనుల ప్రగతి, ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు.ఆదివాసీ హక్కులు, 1/70 చట్టం పరిరక్షణపేరిట అసలైన ప్రగతినిఅడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. సమావేశం లో ఆమదాలవలస మునిసిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొనిగి భాస్కరరావు, సీపాన వెంకటరావు పాల్గొన్నారు.

ఒడిశా బృందం ఎస్‌హెచ్‌జీల పరిశీలన


ప్రకృతి సేద్యం గురించి ఒడిశా బృందానికి వివరిస్తున్న అధికారులు

గార, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గార మండలంలో డీఆర్‌డీఏ, వెలుగు ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) పని తీరు, వారి జీవన ప్రమాణాలు మెరుగుకు చేపడుతున్న కార్యక్రమాలను ఒడి శా అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది.మంగళవారం గార వెలు గు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులకు భువ నేశ్వర్‌కు చెందిన సీఈవో మహాప్రాత్రో, డైరెక్టర్ ఎస్.రాత్‌తో కూడిన అధికారుల బృందం అవగాహన కల్పించింది. ఈసందర్భంగా మహిళా సమాఖ్యకు చెందిన పలువురు సభ్యులతో ఒడిస్సా అధికారులబృందం వ్యాపారాలు, జీవన ప్రమాణా లు, పిల్లలచదువులు అడిగితెలుసుకుంది.ఈసందర్భంగా ఒడిశాఅధికారుల బృం దం సభ్యుడు మహాపాత్రో ఎస్.రాత్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో స్వయం సహాయక సంఘాల పనితీరు, వారి జీవన ప్రమాణాలు మెరుగుకు చేపడుతు న్న ఆర్థికకార్యకలాపాలు, రసాయనఎరువులు వాడకుండా ప్రకృతిసేద్యం, అక్షరా స్యత, విద్య మొదలైన అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. తమ రాష్ట్రంలో ఇక్కడ అనుసరిస్తున్న విధానం ద్వారా మహిళా సంఘాలకు ఎలా చేయూత ఇవ్వాలి అన్న విషయాన్ని తెలుసుకోవడం కోసం పర్యటిస్తున్నట్లు చె ప్పారు.వెలుగు పనితీరు,సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు అమలు తీరును ఏపీఎం వి.సుజాత వారికి వివరించారు.కార్యక్రమంలో సెర్ప్ అధికా రులు శేఖర్ మూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుశీల, కోశాధికారి, కె. దమయంతి, వెలుగు సీఎఫ్‌లు, సీసీలు, ప్రకృతి సేద్యం సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వేతో భూ సమస్యల పరిష్కారం: తహసీల్దార్



జి.సిగడాం: రీ-సర్వే గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

జి.సిగడాం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రీ-సర్వేతో రైతుల భూసమస్యలు పరి ష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని పున్నాం పంచాయతీ పరిధిలోగల ఉల్లివలసలో ఏపీ రీ-సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా రీ-సర్వే గ్రామసభ-అవగాహన ర్యాలీ కార్యక్ర మం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు క్రయ విక్రయాలు జరిపిన వెంటనే రెవెన్యూ భూరికార్డుల్లో తమ భూ హక్కులను నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవి కుమార్, సర్పంచ్ సుంకరి అప్పన్న, ఆర్ఐ ఆబోతుల రాధ, రీసర్వే డీటీ కొత్తపల్లి గాయిత్రి పాల్గొన్నారు.

●కవిటి,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారానికే రీసర్వే నిర్వహిస్తున్నామని తహసీల్దార్ మురళీమోహన్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని డి.గొనపపుట్టుగలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు భూసమస్యలు ఉంటే వాటిని సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో జరిగిన సర్వేలో తప్పులు జరిగిఉంటే మళ్లీ జరుగుతున్న రీసర్వేలో సరిచేసుకోవాలని సూచించారు. సదస్సులో సర్పంచ్ బి.కిరణ్‌కుమారి, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జునపాణిగ్రాహి పాల్గొన్నారు.

జిల్లాలో కుండపోత వర్షం

● ఉరుములు, మెరుపులతో భయాందోళన చెందిన ప్రజలు


శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో చేరిన వర్షం నీరు

ఉద్దానంప్రాంతంలోపాటు జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయం త్రం కుండపోత వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లపై నీరుచేరింది. వేసవి తాపంతో అల్లాడిపోయిన ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది.రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉరుములు, మెరుపుల శబ్దానికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

శ్రీకాకుళం/ఇచ్ఛాపురం/కంచిలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ నుంచి, వర్షపు నీరు రోడ్లపై చేరింది.విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఇచ్ఛాపురం, ఈదుపురం, డొంకూరు, బూర్జపాడు తదితర ప్రాంతాల్లో సాయంత్రం అరగంటపాటు ఎడతెరిపిలేని కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరుచేరింది. కంచిలి మండలంలోని మకరంపురం, జాడిపుడి, బూరగాం, కంచిలి, తదితర గ్రామాలు, సోంపేటమండలంలోని బారువ,పలాసపురం, కవిటిమండలంలోని డీజీపుట్టుగ, నెలకొంక తదితర గ్రామాల్లో కురిసిన వర్షం ప్రజలకు ఊరటనిచ్చింది. వారంరోజులుగా ఎండలకు ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు భారీ వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షం ఆరుతడి పంటలకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. వేసవి దుక్కులకు ఎంతగానో మేలు చేస్తుందని చెప్పారు.

కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం నగరంలోని విశాఖ-బి కాలనీ,ఈ-కాలనీ, గోవింద్‌నగర్ కాలనీ, శ్రీనివాసనగర్, మహాలక్ష్మీనగర్, సాయిలక్ష్మీ నగర్‌ల్లో పర్యటించారు.ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు.ఈ ప్రాంత అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చే స్తున్నామని తెలిపారు.త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్, హెల్త్ అధికారి, నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీరాముని కల్యాణోత్సవం


కవిటి: బైరిపురంలో రాముని కల్యాణంలో పాల్గొన్న గ్రామస్థులు

జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో శ్రీరామనవమి పురస్కరించుకుని మంగళవారం శ్రీరాముని కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్య క్రమాలు ఉన్నాటుచేశారు.

●కవిటి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి):మండలంలోని బైరిపురం సీతారాముల ఆలయం లో రాముని కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి తర్వాత మూడోరోజు స్వామివారికి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ అని గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన పి.జగదీష్, ఎస్.వెంకటరమణ దంపతుల ఆధ్వ ర్యంలో పురోహితులు అప్పలస్వామి,మన్మథరావు పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం జరిగింది.

●శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో గల కోదండ రామాలయంలో సీతారామచంద్ర వార్షిక కల్యాణ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ చంద్రులకు పువ్వులతో అలంకరించారు. సీతారామ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఉంచి తిరువీధి, అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు.

●ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని కోదండరామాలయంలో శ్రీరామునిపట్టాభిషేకాన్ని ప్రధాన అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈదుపురంలో శ్రీరామ మందిరం ప్రతిష్ఠ పురస్కరించుకుని హో మాలు, రామనామ సంకీర్తన యజ్ఞం నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, జడ్పీటీసీ నారాయణమ్మ పూజలు చేశారు. కాగా ఇచ్ఛాపురానికి చెందిన శ్రీ వెంకటేశ్వర డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూ ర్‌లో అన్నపూర్ణ తెలుగు సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రద ర్శించిన భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

●ఆమదాలవలస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస రామాలయం వద్ద సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండవగా నిర్వహించారు. గ్రామంలో 39 ఏళ్లగా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏటా తొమ్మిది రోజుల పాటు సంపూర్ణ రామాయణ ఘట్టాన్ని భాగవతారిణితో నిర్వహిస్తున్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

కంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించవద్దని తహసీల్దార్ ఎన్ .రమేష్‌కుమార్ కోరారు. కంచిలి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుం చి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ సంతో ష్, ఆర్ఐ రౌళో, మండల సర్వేయర్ చలపతి రావు, రమేష్ పాల్గొన్నారు. అనం తరం కంచిలిలోని పౌరసరఫరాల గోదామును తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ ఆకస్మిక తనిఖీచేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం గో దాములో ఉన్న పంచదార, బియ్యం, తదితర సరుకుల నిల్వలు తనిఖీచే శారు. ఆయన వెంట గోదాము డీటీ పాణిగ్రాహి, ఆర్ఐ రౌళో ఉన్నారు.

ముక్తికోసం రామేశ్వరం వరకు వృద్ధుడి సైకిల్ యాత్ర


సైకిల్ యాత్ర చేపడుతున్న పాగల్‌బాబా

కంచిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవిత చరమాంకంలో ముక్తి కోసం 70 ఏళ్ల వృద్ధుడు పూరి నుంచి రామేశ్వరం వర కు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ మేరకు మంగళవారం సా యంత్రం కంచిలి చేరుకున్న పూరీ ప్రాంతంలోని ఫిరూజ్ పూర్ గ్రామానికి చెందిన పాగల్‌బాబాకు స్థానికులు ఆహ్వా నించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశాలోని పూరీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అరసవల్లి, సింహాచలం, అన్న వరం, తిరుపతితో పాటు కేరళలోని ప్రసిద్ధిగాంచిన పలు ఆ లయాలను దర్శించుకొని రామేశ్వరం వరకు యాత్ర చేపట్ట నున్నట్లు తెలిపారు. కుమార్తెలు, కుమారిడికి వివాహం చేసి జీవితంలో అన్ని సమస్యలు నెరవేర్చుకున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణ భారత దేశంలోని ఆలయాలను సైకిల్ యాత్ర ద్వారా దర్శించుకోవాలనే కోరికతో యాత్ర చేపట్టిన ట్లు చెప్పారు.

నేడు హోంమంత్రి రాక

శ్రీకాకుళంక్రైం,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో హోంశాఖ మంత్రి వంగల పూడి అనిత బుధవారంపర్యటించనున్నా రు.విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచివిమానాశ్రయానికి చేరుకుని అక్క డి నుంచి విమానంలో విశాఖపట్నం, రోడ్డు మార్గంలో శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంటారని అధికార వర్గాలు ఒకప్రకటనలో తెలిపా యి.ఈ సందర్భంగా జిల్లా పోలీసు స మావేశ మందిరంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం ఎస్పీలతో చర్చిస్తారు. తొమ్మిదేళ్లుగా పాత్రికేయుడు ఆనంద్ భార్య కాశీమహంతి లతశ్రీ క్యాన్సర్‌తో బాధపడుతోంది. దీంతో అనిత లతశ్రీని మధ్యాహ్నం కలుసుకుంటారు.

నేడు 'నమస్తే-ఎచ్చెర్ల'

జి.సిగడాం,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గెడ్డకంచరాంలో బుధవా రం నిర్వహించ నున్న నమస్తే-ఎచ్చెర్ల కార్యక్రమానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజ రుకానున్నారని టీడీపీ మండలాధ్యక్షు డు కుమరాపురవికుమార్ తెలిపారు.

ఉపకేంద్రం ప్రారంభం

జి.సిగడాం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాతువ విద్యుత్ ఉపకేం ద్రాన్ని మంగళవారం శ్రీకాకుళం ట్రాన్స్‌కో ఈఈ పి. యోగేశ్వరరావు ప్రారంభించా రు. కార్యక్రమంలో ఏడీ యూవీ రమణా రావు, ఏఈ పి.దుర్గాప్రసాదరావు, నాయ కులు కూర్మారావు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

ఎచ్చెర్ల,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల లోని మహిళా ప్రాంగణంలో శిక్షణ పొం దుతున్న ఇద్దరు మహిళలు అదృశ్యమై నట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు న మోదైంది. ఈ ప్రాంగణంలో టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న బి.అనూష, సీహెచ్ తిరుపతమ్మలు మంగళవారం ఉదయం ఇక్కడి నుంచి బయటకు వెళ్లి, సాయం త్రం వరకు తిరిగి రాలేదని శక్తిసదన్ సూపరింటెండెంట్ఎస్.సత్యవతి ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన ఇద్దరికీ తల్లిదండ్రు లు లేరని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు తెలిపారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

శ్రీకాకుళంక్రైం,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎస్పీ మహేశ్వరరెడ్డి మంగళ వారం కలుసుకున్నారు.ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

ఇచ్ఛాపురం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దనిఈగల్ క్లబ్ కోఆర్డినేటర్, కొళిగాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ తెలిపారు. మంగళవారం కొళిగాంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, సీహెచ్ జ్యోతి పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ప్రవేశానికి ఈనెల 13న పరీక్ష జరగనుందని ఎచ్చెర్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.ఈ మేరకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

15 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గుజరాతీపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల తేదీలు ఖరారుచేసినట్లు ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో సెమి స్టర్ పరీక్షలు 15న, రెండో సెమిస్టర్ పరీక్షలు 26న, రెండోసెమిస్టర్ ప్రాక్టికల్స్15న, నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ 26 తేదీన ప్రారంభానున్నాయని పేర్కొన్నారు. అలాగే 2022-23లో చేరిన విద్యార్థులకు లాంగ్ టర్మ్ ఇంటర్‌షిప్ అసెస్మెంట్ ఈనెల 23 నుంచ 25వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

దర్గా కమిటీ ఎన్నిక

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని లాలాపేటలో గల రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వ ర్యంలోగల హజరత్ యూసుఫ్‌షా టకియా దర్గా కమిటీ ఎన్నిక మంగళవారం వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాదిక్ అధ్యక్షతన ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా ఎండీ ఫరీదుద్దీన్, ఉపాధ్య క్షుడిగా అబ్దుల్లా, కార్యదర్శిగా ఎస్.ఆలీ, ట్రెజరర్‌గా తాజ్‌ఖాన్,సభ్యులుగా అక్తర్‌ఖాన్, అలీమ్‌ఖాన్, ఇర్ఫాన్, జాకీర్, ఉస్మాన్, రఫీ ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

గుజరాతీపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులను మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం రూపొందించి రిజర్వ్ కేటగిరి ప్రాతిపదికన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, పడాల ప్రతాప్ కుమార్ కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ప్రస్తుతం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారీ కేవలం మెరిట్ ప్రకారం రూపొందించినట్లు తెలిపారు. ఈ విధంగా చేస్తే రిజర్వ్ కేట గిరిలో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర అన్ని వర్గాల ఉపాధ్యాయినులు నష్టపోతారని వివరించారు. జీవో- 90 ప్రకారం సీనియార్టీ జాబితాలు రూపొందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

వేణుగోపాల స్వామికి పంచామృతాభిషేకం

గార ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్వేతగిరిపై వెలసిన కాళీయమర్ధన వేణుగోపాల స్వామి వారికి చైత్ర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం పంచా మృతాభిషేకం నిర్వ హించారు.ట్రస్టు బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి దంప తుల ఆధ్వర్యంలో అర్చకులు ఆరవెల్లి ఆనంద్ కాశ్యప్ పూజలు జరిపారు. అనంతరం స్వామి వారికి పుష్పాలంకరణ సేవ నిర్వహించారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

కంచిలి, ఏప్రిల్ 8(ఆంధ్ర జ్యోతి): ఘటిముకుందపు రంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో మంగళవారం వి గ్రహాన్నిప్రతిష్ఠించారు. కార్యక్ర మంలో కామేష్, ప్రకాష్, కిషో ర్‌పాడి, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీ నివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రోడ్లను తవ్వి వదిలేశారు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కొత్తూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు మార్గాల్లో వంశధార ప్రాజెక్టు ప్రధాన నీటి కాలువకు ఖానాలు వేసేందుకు గాను రోడ్లను తవ్వి వదిలేయడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పనుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కలిగాం-అంగూరు మార్గంలో సందిమ్మ అమ్మతల్లి ఆలయం సమీపంలో, బమ్మిడి గ్రామానికి వెళ్లే మార్గంలో తమ్మయ్యకర్ర చెరువు వద్ద రోడ్లను 20 రోజుల కిందట లోతుగా తవ్వి పనులు పూర్తి చేయలేదు. దీంతో అటుగా ప్రయాణించేవారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కలిగాం- అంగూరు మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. సుమారు 11 గ్రామాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. వెంకటాపురం, బమ్మిడి, గురండి, జోగిపాడు, పాతపాడు, ఆర్కే పురం, మదనాపురం, సోమరాజపురం, అంగూరు, ఆకులతంపర, సోభనాపురం ప్రజ లు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంది. అలాగే ఒడిశాకు వెళ్లాలంటే కొత్తూరు రహదారికి ప్రత్యా మ్నాయంగా ఉన్న ఈ కలిగాం-అంగూరు మార్గంలోనే ప్రయాణించాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



బమ్మిడి రోడ్డు ఇలా..



కలిగాం-అంగూరు మార్గంలో..

చెట్టు పైనుంచి పడి రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి



శ్రీరాములు (ఫైల్)

నరసన్నపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): లుకలాం గ్రామంలో మంగళవారం చింత చెట్టు ఎక్కి బొట్టలు తీస్తూ జారిపడి రిటైర్డ్ ఆర్మీ జవాన్ బొచ్చ శ్రీరాములు (52) మృతిచెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరాములు తన కల్లంలో ఉన్న చింత చెట్టు ఎక్కి బొట్టలు తీసేందుకు చెట్టును దులుపుతున్న సమయంలో అదుపుతప్పి కింద పడి పోయారు. అయితే భర్త ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో భార్య సూరోడు కల్లానికి వెళ్లి చూసేసరికి చింతచెట్టు కింద పడి ఉన్న శ్రీరాములును చూసి బోరున విలపించింది. స్థానికులు అక్కడికి చేరుకుని శ్రీరాములును సామాజిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీ కరించారు. భార్య సూరోడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఒక కుమార్తెకు వివాహం కాగా మరో కుమార్తెకు వివాహం కావాల్సి ఉంది.

చేపల వేటకు వెళ్లి.. వలలో చిక్కుకుని

● మెట్టక్కివలస మత్స్యకారుడి మృతి

శ్రీకాకుళంక్రైం/ఆమదాలవలస,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు వలలో చిక్కుకుని నీట మునిగి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆమదాలవలస మండలం మెట్టక్కివలస మండల వీధికి చెందిన గయా బాలు(47) శ్రీకృష్ణ తులసి స్వదేశీయ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యుడిగా పని చేస్తున్నాడు. ఈనెల ఏడో తేదీ రాత్రి 11 గంటల సమయంలో కంద్రవీధికి చెందిన దుదిష్ట బెహర ఆయన కుమారుడు నాగరాజుతో కలిసి కనింవలస చెరువులో చేపలవేటకు వెళ్లాడు. చేపల పడడంతో దుదిష్ట కుమారుడు చేపలు విక్రయించేందుకు మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి వేకువజామున ఐదు గంటలకు చెరువు దగ్గరకు వచ్చి బాలుని పిలిచిన పలుకలేదు. ఇంతలో చెరువులో ఎవరో తేలుతు కనిపించడంతో వెళ్లి పరిశీలించారు. కాలికి వల చుట్టుకుని నీటిలో తేలుతూ బాలు కనిపించాడు. దీంతో ఆయన భార్య పద్మకు ఫోన్ చేసి విషయాన్ని దుదిష్ట తెలియజేశాడు. దీంతో పద్మ కుటుంబ సభ్యులు, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్, సభ్యులకు విషయం తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంగళవారం రూరల్ పోలీసులకు పద్మ ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రాము అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

హైదరాబాద్‌లో హోంగార్డు..



సింహాచలం (ఫైల్)

సరుబుజ్జిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిగురువలస గ్రామానికి చెందిన హోంగార్డు నల్లాన సింహాచలం (40) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు.. హైదరాబాద్‌లో సింహాచలం 15 ఏళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లోని మియాపూర్ జంక్షన్ వద్ద పోలీస్ అంబ్రెల్లాను ఓ లారీ ఢీకొట్టింది. దీంతో విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు పోలీస్ సిబ్బందికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందాడు. విషయం తెలియడంతో చిగురువలసలో విషాదఛాయలు అలముకున్నాయి. సింహాచలం తండ్రి త్రినాథరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు సింహాచలానికి తల్లితో పాటు భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మియాపూర్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతదేహానికి చిగురువలసలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు..

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఇచ్ఛాపురం వద్ద పీర్లకొండ సమీపంలో గల రైలు ట్రాక్ వద్ద 20 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు.ఈ మేరకు పలాస జీఆర్పీ పోలీసులకు సమాచారం తెలియజేశారు. పలాస జీఆర్పీ కానిస్టేబుల్ డి.హరినాథ్ కేసు నమోదు చేశారు.

ఉపాధి వేతనదారుకు గాయాలు

మెళియాపుట్టి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టుపురం పంచాయతీలో మంగళవారం ఉపాధి పనులు చేస్తున్న మహిళా వేతనదారు తమ్మినేని తులసమ్మ (55) పని ప్రదేశంతో ఒక్కసారి సొమ్మ సిల్లి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో ఆమె ఎడమ చేయి విరిగిపోయింది. వెంటనే ఇతర కూలీలు సపర్యలుచేసి వైద్య చికిత్స నిమిత్తం చాపర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏపీవో తెంబూరు రవి పని ప్రదేశానికి వెళ్లి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

ఆదివాసీలపై వేధింపులు ఆపాలి

మెళియాపుట్టి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులపై ఎక్సైజ్ శాఖ తప్పుడు కేసులు పెడుతూ వేధింపులకు గురిచేస్తోందని, తక్షణం వీటిని నిలువరించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపోజీ పేటకు చెందిన ఇద్దరు గిరిజనులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. సారా తయారీ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తే అభ్యంతరం లేదని, అయితే అమాయకులైన గిరిజనుల పేర్లు పాత రికార్డుల్లో ఉన్నాయని, వలసలు పోయిన వస్తు వారిపై కేసులు పెట్టి వేధించడం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ పాపారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సవర శ్రీను, సవర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో 35 మందిపై బైండోవర్

పలాసరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పలాస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలాస మండల పెదచంల, చినంచల, పెంటిభద్ర గ్రామాల్లో సారా విక్రయాలపై చేసిన దాడుల్లో 35 మందిని పట్టుకొని మంగళవారం తహసీల్దార్ ఎస్.కల్యాణచక్రవర్తి ఎదుట హాజరుపరిచారు. వీరందరికీ ఒక సంవత్సరం కాలపరిమితి, రూ.లక్ష జరిమానా విధించి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీనారాయణ, ఆర్ఐ ఖగేశ్వరనాయుడు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ కార్య వర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావాడ కొండలరావు, ఉపాధ్యక్షులుగా ఎం.లక్ష్మి, కార్యదర్శిగా జీవీ రమణ, జాయింట్ సెక్రటరీగా యాళ్ల నర్సింగరావు, ట్రెజరర్‌గా వాన శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా ధర్మాన వెంకటరమణ, జామి కామేశ్వరరావు, ఇప్పిలి తాత, తులాగు మధుసూదనరావు, రెడ్డి జగన్నాథరావు, శ్రీపాద రామకృష్ణలను ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని న్యాయాధికారి హరిప్రియ అభినందించారు.

నేడు కొత్తూరులో షణ్ముఖ శర్మ ప్రవచనం



కొత్తూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొత్తూరు శ్రీవరప్రద వేంకటేశ్వర కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

లీజుకు తీసుకున్న ఆస్తిని ప్రభుత్వానికి ఇచ్చా

● మట్టి మాఫియాపై చర్యలు తీసుకోండి
● మునిసిపల్ సమావేశంలో దువ్వాడ శ్రీకాంత్

పలాస, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూదికొండపై కంకర తరలింపునకు వైసీపీ హయాంలో అనుమ తులు తీసుకున్న లీజు ఆస్తిని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందించానని సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మునిసిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. వైసీపీ కౌన్సిలర్ శిష్టు బృందావతి మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 51 సూదికొండ కాలనీలో ప్రభుత్వమే నేరుగా కంకర తవ్వి తరలి స్తోందని, గతంలో ఈ ప్రాంతంలో లీజుకు ఇచ్చిన క్వారీ రద్దు చేసి ప్రస్తుత ప్రభుత్వం నేరుగా తవ్వడం వల్ల ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగించాలన్నారు. దీనికి శ్రీకాంత్ బదులిస్తూ.. గతంలో తనకు గనులు, రెవెన్యూ అధికారులు క్వారీ లీజుకు అనుమతులిచ్చారని, దీనిపై తన ప్రత్యర్థి అధికారులకు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఆదేశించారన్నారు. అయితే ఆ తరువాత కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష కోరిన మీదట సదరు ప్రాంతాన్ని ప్రభుత్వానికి అప్పగించామన్నారు. అయితే ఇదే సర్వే నెంబర్‌లో సూదికొండపై ఉన్న కొండమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రాంతంలో అక్రమంగా తరలించిన రూ.కోటి విలువ చేసే మట్టిపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్దానం రక్షిత నీటి పథకానికి రూ.63.50 లక్షలకు వెచ్చిస్తున్నామని, సాధారణ నిధులు అవసరం అవుతున్న దృష్ట్యా ఆమోదం తెలపాలని చైర్మన్ కోరడంతో సభ్యులు ఆమోదించారు. పాత ఉద్దానం నీటి పథకం పైపు లైన్లు పాడయ్యాయని కోఆప్షన్ సభ్యుడు బి.సంతోష్‌కుమార్ సభ దృష్టికి తీసుకువెళ్లగా కుతెలపగా సమగ్ర నీటి పథకం ఉద్దానం పైపులైన్లు, ట్యాంకులకు అనుసంధానం చేసి నీరు అందిస్తామని డీఈఈ కనకరాజు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, వైస్‌చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

కల్యాణం.. కమనీయం

నరసన్నపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామంలో వసంత నవమి ఉత్సవాల్లో భాగంగా చైత్రశుద్ధ ఏకాదశి మంగళవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితుడు మావుడూరి జగదీశ్వర శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు సీతమ్మ అలకసంబరం, కల్యాణంలోని వివిధ ఘట్టాలని శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు వాన గోవిందరాజులు, డా.రెడ్డి సంధ్య, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. మధ్యాహ్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



కొత్తూరు రామాలయంలో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

కొత్తూరు రామాలయంలో..

కొత్తూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొత్తూరు రామాలయంలో చైత్రశుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం సీతారాములు కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే వేదపండితులు విశేష కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని ముఖలిం గేశ్వర స్వామి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి విశేష అర్చనలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి చేపట్టారు. గ్రామస్థులు మంగళ హారతులిచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, అప్పారావు, యోగి, శివ, శ్రీకృష్ణ, అచ్యుత, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

దీర్ఘాశిలో తిరువీధి..

పోలాకి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల సందర్భంగా దీర్ఘాశిలో సీతారాముల విగ్రహాలకు మంగళవారం తిరువీధి ఉత్సవం చేపట్టారు. మంగళవాయిద్యాల నడుమ రథంలో ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మెండ వీధి శ్రీరామా భజన బృందం, గణేష్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీరాముల వారి కల్యాణం నిర్వహించారు. బుధవారం పట్టాభిషేకం చేపడుతున్నామని, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.



దీర్ఘాశిలో సీతారాముల తిరువీధి

భూముల రీ సర్వేని సద్వినియోగం చేసుకోండి

జలుమూరు (సారవకోట) ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ సర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కోరారు. మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసిన దాసుపురం రెవెన్యూ గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సునిర్వహించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి రీ సర్వే చేపట్టిన ప్పుడు రైతులు రుజువు పత్రాలను చూపించి రికార్డుల్లో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. గతంలో ఏమైనా తప్పొప్పులున్నా వాటిని సరి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

అవగాహన ర్యాలీ

నరసన్నపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సులు, ర్యాలీలను రెవెన్యూ అధికారులు చేపట్టారు. మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నడగాం, కొత్తపోలవలస గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. గ్రామాల్లో భూ సమస్యలను శతశాతం పరిష్కరించేందుకు రీ సర్వే చేపడుతున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్య క్రమంలో మండల సర్వేయర్ అప్పలస్వామి, ఆర్ఐ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రారంభం

హిరమండలం,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన బొమ్మిక గ్రామంలో మంగళవారం భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2వ దశ రీసర్వే ప్రక్రియ ప్రారంచామన్నారు. పెద్ద సంకిలి, రెల్లివలస గ్రామాల్లో రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

లేఅవుట్ పరిశీలన



నందిగాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లట్టిగాం సమీపంలో జగనన్న లేఅవుట్‌ను పలాస ఆర్డీవో జి.వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల్లో ఇబ్బందులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోమటూరు రెవెన్యూ పరిధిలో 22ఏ భూ సమస్యపై పరిశీలించారు. ఆయనతో పాటు డీటీ ఆర్.రామారావు, మండల సర్వేయర్ హనుమంతరావు, ఆర్ఐ వి.సింహాచలం, వీఆర్వోలు ఉన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 30 మంది ఎంపిక

పోలాకి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కంటి శస్త్రచికిత్సలకు 30 మందిని ఎంపిక చేసినట్లు నేత్ర వైద్యాధికారి అరుణాదేవి, నేత్ర వైద్య సహాయకుడు సాంబశివరావు తెలిపారు. మంగళవారం పోలాకి పీహెచ్‌సీలో నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మందికి కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో నిర్వహించేందుకు తరలిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి కమిటీ కన్వీనర్ బరాటం రామారావు, ప్రోగ్రాం డైరెక్టర్ అప్పలరాజు, వైద్యాధికారి శ్రీనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

పోలాకి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను వైద్యాధికారి శ్రీనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఫైలేరియా సోకిన వారు రోజూ సబ్బుతో సదరు ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలన్నారు.

చిరుజల్లులతో ఊరట

పలాసరూరల్,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పలాస పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఒక్కసారిగా గాలులతో కూడిన వర్షం కురిసింది. మూడు రోజులుగా ఎండ, వేడి గాలులతో అల్లాడిన ప్రజలు ఈ చిరుజల్లులతో ఉపశమనం పొందారు. యడంతో మండల ప్రజలు చిన్నపాటి ఉపశమనం పొందారు.

దేశ శ్రేయస్సే బీజేపీ లక్ష్యం: సిరిపురం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు తేజేశ్వరరావు

పాతపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేశ శ్రేయస్సే బీజేపీ లక్ష్యమని, ఈ మేరకు పార్టీ సిద్ధాంతాలు రూపొందించబడ్డాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ క్రియాశీలక సభ్యులతో సమావేశం నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిలా కార్యదర్శి సలాన రాఘవరావు, రౌతు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల వినతి

హరిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు గువ్వాడ మదన్‌మోహన్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ హైమవతికి వినతి పత్రం అందించారు. పేస్కేల్ అమలుచేయాలని, అర్హత కలిగిన వారికి 70 శాతం పదోన్నతి కోటా ఇవ్వాలన్నారు. రాత్రి డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, కార్యక్రమంలో సంఘ నేతలు పి.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, సీతారాం, లాబాల హరిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించండి

నరసన్నపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు గ్రామస్థులు సహకరించాలని ఎంఈవోలు పి.దాలినాయుడు, ఉప్పాడ శాంతారావు కోరారు. ఈ మేరకు మంగళవారం తామరాపల్లిలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. హడ్కో కాలనీలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సీహెచ్ మణికుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠ శాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించి ఎన్‌రోల్‌మెంట్ పెంచాలన్నారు. ఈనెల 23 నాటికి పిల్లల నమోదు స్పెషల్ డ్రైవ్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 కె.చంద్రమౌళి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలి

జలుమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈవో ప్రసాదరావు అన్నారు. చిన్నదూగాం ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. వేసవి సెలవుల్లో గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి బడిఈడు పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు ప్రభుత్వ రాయితీలపై అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందించండి

టెక్కలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మొఖలింగాపురం గ్రామపంచాయతీలోని బెండకాయలపేట, మొఖలింగాపురం గ్రామాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించాలని సీపీఎం నాయకులు కొల్లి ఎల్లయ్య, నంబూరు షణ్ముఖరావు అన్నారు. మంగళవారం బెండకాయలపేటలో పార్టీ గిరిజన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కె.అప్పారావు, డి.నీలవేణి, ముత్యాలమ్మ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించాలి

టెక్కలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించి ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సంతబొమ్మాళి మండల వైసీపీ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు చేపడుతున్న కక్షపూరిత రాజకీయాలను ఎదుర్కొనేందుకు అందరం కలిసిక ట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

నందిగాం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో టి.రాజారావు కోరారు. నౌగాం, దేవపురం, కొత్తగ్రహారం సచివాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాల్లో డాక్యుమెంటేషన్, ఆధార్ అప్‌డేషన్, ఐదు నుంచి ఏడు, 15 నుంచి 17 ఏళ్ల లోపు పిల్లల బయోమెట్రిక్, ఫోన్ నెంబరు అనుసంధానం నమోదు చేసుకోవచ్చన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళిత వర్గాల మార్గదర్శకులు అంబేడ్కర్, పూలే

హరిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దళిత, పీడిత వర్గాల మార్గదర్శకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావు పూలేలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య అన్నారు. మందస అంబేడ్కర్ విజ్ఞాన్ మందిరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను వాడవాడలా నిర్వహించాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్క రించారు. కార్యక్రమంలో సంఘ నేతలు సంక కాళిదాసు, ఇప్పిలి చంద్రశేఖర్, శంకర్, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి

జలుమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. హుస్సేనుపురం, యలమంచిలిలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పలు పంచాయతీల్లో నిర్మించిన కేంద్రాలు వృథాగా ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం తీసుకురావాలన్నారు. ఏయే పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణం చేపట్టలేదో వాటికి స్థలాలను గుర్తించి పనులు చేపట్టాలని ఈవోపీఆర్డ ఉమామహేశ్వరరావును ఆదేశించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

హిరమండలం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇంటర్‌లో కళాశాలలో చేరితే అందే సౌకర్యాలను వివరించారు. అధ్యాపకులు కె.బాలకృష్ణ, ప్రశాంతి సాయి, పీవీ నరసింహులు, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోండి

కొత్తూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ ధరలు పెంచి పేదలపై కేంద్ర ప్రభుత్వం పెనుభారం మోపిందని, తక్షణం పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.ప్రసాదరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2, ఉజ్వల పథకం కింద ఇచ్చే సిలిండర్ ధరలు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వృత్తివిద్యలో ప్రావీణ్యం సాధించాలి

పాతపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యలో ప్రావీణ్యం సాధించాలని ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి అన్నారు. స్థానిక పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఐటీ, ఐటీఈఎస్ అండ్ ఆటోమోటివ్ కోర్సుల నిర్వహణకు గాను 10 రోజుల శిక్షణ ఇస్తున్నామన్నారు. మంగళవారం ఈ శిక్షణను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా కోఆర్డినేటర్లు బి. తిరుపతిరావు, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.